www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 16 అక్టోబర్ 2023




పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం బీచ్ పర్యాటకులతో ఆదివారం సందడిగా మారింది. పర్యాటకులు ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు కెరటాలపై, ఇసుక తిన్నెలపై సరదాగా గడిపారు. ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సరివి, కొబ్బరి తోటలలో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.



బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు



వినియోగదారులకు షాకిస్తున్న విద్యుత్ బిల్లులు

అదనపు ఛార్జీల పేరిట బాదుడే బాదుడు

భారాలకు సామాన్య ప్రజలు గగ్గోలు

రూ.700 బిల్లు వస్తే సగం అదనపు ఛార్జీలే

ఉచితాల కింద రూపాయి ఇచ్చి రూ.పది దోపిడీ అంటూ జనాల్లో చర్చ

ఈ నెల మూడో తేదీన తీసిన కరెంటు బిల్లులో అదనపు భారాలు ఇలా..

వాడుకున్న కరెంటుకు వచ్చిన బిల్లు రూ.394.50

ఫిక్స్‌డ్ ఛార్జీ - రూ.20
కస్టమర్ ఛార్జీ - రూ.45
ఇడి ఛార్జీ - రూ.7.20
సర్‌ఛార్జీలు - రూ.25
ఇడిఐఎన్‌టి - రూ.0.07
ట్రూ అప్ ఛార్జీ - రూ.68
ఎఫ్‌పిపిసిఎ ఛార్జీ - రూ.127
ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జీ - రూ.49
లాస్‌గెయిన్ ఛార్జీ - రూ.0.23
మొత్తం బిల్లు - రూ. 736

వాడుకున్న కరెంటు బిల్లు రూ.394.50, అదనపు ఛార్జీల వడ్డన రూ.342

సర్దు 'పోటు'..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కరెంటు బిల్లుల మోతతో సామాన్య ప్రజలు విలవిల్లాడుతున్నారు. అడ్డూఅదుపూ లేని ఈ బాదుడు ఏమిటంటూ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బిల్లులో సగం అదనపుఛార్జీల భారమే ఉండటంతో జనం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో ప్రతినెలా బిల్లులు కట్టలేక సామాన్య ప్రజానీకం గగ్గోలు పెడుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 12 లక్షల గృహవిద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అత్యధిక కనెక్షన్లు సామాన్య ప్రజానీకానివే. విద్యుత్ ఛార్జీల పెంపుతో పాటు, అదనపు ఛార్జీల భారం వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కరోనా తర్వాత సామాన్య ప్రజానీకం ఆదాయాలు భారీగా తగ్గిపోయాయి. పెట్రోల్, డీజిల్ పెరుగుదల, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో సామాన్య ప్రజానీకం జీవనం కష్టంగా మారింది. ముఖ్యంగా పట్టణాల్లో పనిచేసే చిరుద్యోగులు, హమాలీలు, చిరువ్యాపారుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. చిరుద్యోగులకు రూ.పది నుంచి రూ.15వేలలోపే జీతాలొస్తున్నాయి. ఈ జీతంతో ఇంటి అద్దె, పిల్లల చదువులు, ఆసుపత్రి ఖర్చులు వంటివి నెట్టుకు రావడమే గగనంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో రూ.400 కరెంటు బిల్లుకు మరో రూ.400 అదనపు ఛార్జీలు వేయడంతో మోయలేని భారంగా మారింది. ఫిక్స్‌డ్ ఛార్జీలు, కష్టమర్, ఇడి, సర్‌ఛార్జీలతోపాటు, ట్రూ అప్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు భారీగా వేస్తున్నారు.

అక్టోబర్ నెల మొదటివారంలో తీసిన కరెంటు బిల్లు రూ.736 రాగా, అందులో ఫిక్స్‌డ్ ఛార్జీ రూ.20, కష్టమర్ ఛార్జీ 45, ఇడి ఛార్జీ రూ.7.20, సర్‌ఛార్జీ రూ.25, ట్రూఅప్ ఛార్జీ 68, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీ 127, ఎఫ్‌పిపిసిఎ-2 ఛార్జీకింద రూ.49 మొత్తం రూ.342 అదనపు ఛార్జీల భారం పడింది. అంటే బిల్లులో సగం అదనపుఛార్జీలే ఉన్నాయి. గడిచిన కొన్నినెలలుగా ఇదేవిధంగా విద్యుత్ బిల్లులు వస్తుండటంతో జనం గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సామాన్య ప్రజానీకం ఉక్కిరిబిక్కిరి అవుతుండగా కరెంటు బిల్లుల మోత జనాన్ని కోలుకోలేనివిధంగా దెబ్బతీస్తోంది. ఇటీవల కాలంలో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వాడకం భారీగా పెరిగింది. ఫ్రిజ్, కూలర్, మిక్సీ, గ్రైండర్, ఐరన్ బాక్స్ వాడకాలు పెరగడంతో పెరిగిన ఛార్జీలతో బిల్లు తడిసిమోపుడువుతోంది. మళ్లీ అదనంగా ఛార్జీల భారం వేయడంతో సామాన్యులు సైతం ప్రతినెలా రూ.వెయ్యికిపైగా బిల్లు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. కరెంటు బిల్లు భారం మోయలేక సకాలంలో కరెంట్ బిల్లులు కట్టలేకపోతున్నారు. సకాలంలో బిల్లులు కట్టలేని వినియోగదారులపై ఫైన్‌ల భారం పడుతోంది. ఒక్కరోజు ఆలస్యమైన బిల్లుకు రూ.వంద ఫైన్ చెల్లించాల్సి వస్తోంది. బిల్లులు సకాలంలో కట్టకపోతే విద్యుత్ అధికారులు ఫీజులు పీకేస్తూ జనాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సంక్షేమం పేరుతో రూపాయి ఇచ్చి ప్రభుత్వం రూ.పది లాగేస్తుందంటూ జనంలో తీవ్ర చర్చనడుస్తోంది. విద్యుత్ భారాలను నిరసిస్తూ ఇప్పటికే సిపిఎంతోపాటు, వామపక్షాలు నిరసనలు కొనసాగిస్తున్నాయి. ప్రజలు సైతం రోడ్డెక్కితే తప్ప ప్రభుత్వాలు దిగొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీల పెంపు వంటివి జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల్లో ఉచితాలు ప్రకటించడం, గెలిచిన తర్వాత ప్రజలపై భారాలు మోపుతూ ప్రభుత్వాలు సామాన్యుల జీవితాలతో వికటాట్టహాసం చేస్తున్నాయి.



ENERGY CHRG	394.50
FIXED CHRG	20.00
CUST CHRG	45.00
ED	7.20
SURCHARGES	25.00
ED INT	0.07
TRUEUP CHRG	68.00
FPPCA CHRG	127.00
FPPCA2 CHRG	49.00
SHORTFALL	0.00
ACD SURCHRG	0.00
FAN INSTAL	0.00
ADJ AMOUNT	0.00
LOSS/GAIN	0.23
BILL AMOUNT	736.00
GOVT SUBSIDY	0.00
BILL AFT	736.00

విధించిన ఛార్జీలివే..

రాష్ట్రాన్ని గంజాయి ప్రదేశ్‌గా మార్చేశారు

జెవివి జిల్లా 17వ మహాసభలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను గంజాయిప్రదేశ్‌గా మార్చేశారని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ విమర్శించారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక జిల్లా 17వ మహాసభ ఘనంగా జరిగింది. ఈ మహాసభకుజెవివి జిల్లా ఉపాధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు అధ్యక్షత వహించారు. సాబ్జీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత జెవివి జిల్లా సంఘం ఆధ్వర్యంలో జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ చుండూరి సాయిబాబా వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చుండూరు సాయిబాబు, నంద్యాల భాస్కరరావు జెవివి జెండాను ఆవిష్కరించారు. యుటిఎఫ్ కార్యాలయంలోని సభావేదికకు ఎంఎస్.స్వామినాథన్ వేదికగా నామకరణం చేశారు. అనంతరం సాబ్జీ మాట్లాడుతూ నేటి సమాజంలో శాస్త్రీయతపై అవగాహన పెరగాలంటే జన విజ్ఞాన వేదిక మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కీర్తిశేషులు సత్యవతి, చింతపల్లి శ్రీనివాసరావు జన విజ్ఞాన వేదిక చేసిన సేవలు ఎనలేనివని, వారు లేనిలోటు కనిపిస్తుందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానం వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిఎం జగన్ తాను ఇచ్చిన హామీల్లో 99 శాతం పూర్తి చేశామని చెబుతున్నారని, అయితే ఉపాధ్యాయులకు ఇచ్చిన సిపిఎస్ రద్దు హామీని అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని రద్దుచేసి మనువాదాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. దేశాభివృద్ధి తిరోగమనంలో పయనిస్తుందని విమర్శించారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టే దుర్మార్గ పాలన రాష్ట్రంలో సాగుతుందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపి మాట్లాడుతూ పాదయాత్రలో జగన్ అధికారంలోకి వచ్చిన వారం రోజులకే సిపిఎస్ రద్దుచేస్తామని చెప్పి నేడు జిపిఎస్ తీసుకురావడం వల్ల నష్టం తప్ప లాభం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పి.రాజేష్, ప్రభుత్వసుపరింటెండెంట్ ఎం.వీరాస్వామి, చెకుముకి కన్వీనర్ ఎస్ఎస్.రమేష్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ఎస్.విజయరామరాజు, నాయకులు రామభద్రరావు, జి.రామానుజం, వై.అజయ్‌కుమార్, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాస్, జి.రామలక్ష్మణ్, ఆర్.వెంకన్నబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ సాబ్జీ

జెవివి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా ప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రామ లక్ష్మణరావు

భీమవరం: జన విజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారితో పాటు మరో 19 మందితో జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన జన విజ్ఞాన వేదిక 17వ జిల్లా మహాసభలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జెవివి రాష్ట్ర పరిశీలకులు ఎస్ఎస్.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో జెవివి జిల్లా అధ్యక్షులుగా చింతపల్లి ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా జామున రామలక్ష్మణరావు, కోశాధికారిగా మల్లుల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే మరో 19 మందితో జిల్లా కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.



విద్యుత్ భారాలను ఉపసంహరించాలి

ప్రజాశక్తి - భీమవరం

సామాన్యులపై విద్యుత్ ఛార్జీల భారాలను ప్రభుత్వం విరమించుకోవాలని వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, సిపిఐ పెంటపాడు మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచి ప్రజల సొమ్ము కొల్లగొడుతున్నారని తెలిపారు గతేడాది కరెంట్ ఛార్జీలు పెంచి రూ.1400 కోట్ల భారం మోపిందని, శ్లాబులు మార్చేశారని పదేళ్ల నుండి వాడుకున్న కరెంటుకు అప్పుడే బిల్లులు కట్టినప్పటికీ మళ్లీ సర్దుబాటు ఛార్జీల పేరుతో జనంనెత్తిన రూ.ఆరు వేల కోట్లు భారం వేశారని, గత నాలుగేళ్లలో రూ.25 వేల కోట్ల విద్యుత్ భారాలు ప్రజల నెత్తిమీద మోపారని తెలిపారు. గతంలో సోలార్ విద్యుత్ యూనిట్ రూ.12 ఉండగా ఉత్పత్తుల ఖర్చులు తగ్గి యూనిట్ రెండు రూపాయలకు పడిపోయిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడుదొంగలని, బహిరంగ మార్కెట్‌లో యూనిట్ పది రూపాయల నుంచి రూ.20 వరకూ కొంటున్నారని ఇందులో కూడా భారీ అవినీతి చోటు చేసుకుందని తెలిపారు

ఇటీవల నిబంధనలకు వ్యతిరేకంగా హిందూజా సంస్థకు రూ.1200 కోట్లు అప్పజెప్పారని 200 యూనిట్లలోపు వాడుకునే ఎస్‌టి, ఎస్‌సి, మైనార్టీలకు ఉచిత కరెంటు అమలు జరిగేదని ఇప్పుడు ఆ విధానాలకు స్వస్తి పలకాలని తెలిపారు. ఈ విధానాపై ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరక వెంకట్రావు, తేతల నాగిరెడ్డి, యండ్రపు కృష్ణ, కర్రి సాయిరెడ్డి, పెనగంటి దుర్గ, బర్ల బాలాజీ, ఎస్‌విఎస్.రెడ్డి, వంక అప్పారావు, సుబ్బిరెడ్డి, దత్తు రాము, బండారు శ్రీను పాల్గొన్నారు.

గత ప్రభుత్వాలకు పట్టిన గతి వైసిపికి తప్పదు

వామపక్షాల విమర్శ - విద్యుత్ ఛార్జీల పెంపుపై ప్రజా బ్యాలెట్

ప్రజాశక్తి - భీమవరం

రకరకాల ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచి విద్యుత్ వినియోగదారులపై పెను భారాన్ని మోపుతున్న వైసిపి ప్రభుత్వానికి గత ప్రభుత్వాలకు పట్టిన గతే పడుతుందని వామపక్షాలు విమర్శించాయి. అడిగేవారు లేరని పెట్రేగిపోతే ప్రజాగ్రహానికి గురై చరిత్రలో నామరూపాలు లేకుండా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వామపక్ష నేతలు హెచ్చరించారు. భీమవరం రైతు బజారులో ఆదివారం వామపక్షాలు సిపిఐ, సిపిఎం, ఫార్వర్డ్ బ్లాక్, ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో విద్యుత్ ఛార్జీలు పెంపునకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకులు దండు శ్రీనివాసరాజు మాట్లాడారు. విద్యుత్ ఛార్జీలపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వహించిన ప్రజాబ్యాలెట్‌లో విద్యుత్ ఛార్జీలు పెంపును వ్యతిరేకిస్తూ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. విద్యుత్ ఛార్జీలపై ప్రజావ్యతిరేకత గమనంలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచిన నేపథ్యంలో గతంలో టిడిపి భారీ మూల్యం చెల్లించుకుందన్నారు. చరిత్ర పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గమనంలో ఉంచుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, సిహెచ్.రంగారావు, సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు నాగిడి శాంతమూర్తి, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు వాటాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రజాబ్యాలెట్లో ఓటు వేస్తున్న విద్యుత్ వినియోగదారులు

విద్యుత్ ఛార్జీల పెంపునకు అనుకూలమా, వ్యతిరేకమా అనే అంశంపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. ఈ బ్యాలెట్‌లో మొత్తం 245 మంది విద్యుత్ వినియోగదారులు పాల్గొని ఓట్లు వేశారు. వారిలో 241 మంది వినియోగదారులు విద్యుత్ ఛార్జీలు పెంపునకు వ్యతిరేకంగా ఓటు వేశారు. అలాగే నలుగురు విద్యుత్ ఛార్జీలు పెంపునకు అనుకూలంగా తమ అభిప్రాయాలను ప్రజా బ్యాలెట్‌లో వేశారు.

గణపవరం: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పిప్పర సెంటర్‌లో ఆదివారం ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ నాయకులు జెక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి పెచ్చెట్టి నరసింహమూర్తి, మండల నాయకులు పి.గోవింద మాట్లాడుతూ ప్రజాబ్యాలెట్‌లో మొత్తం198 ఓట్లు పోలవగా ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ 195 ఓట్లు రాగా అనుకూలంగా మూడు ఓట్లు పోలయ్యాయన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై ఎంత వ్యతిరేకత ఉందో దీన్నిబట్టి అర్థ చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం స్పందించి ఛార్జీలను తక్షణం తగ్గించాలని కోరారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. యూనిట్‌కు 80 పైసలు అదనంగా వసూలు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు నరాలశెట్టి రామకృష్ణ, సోడదాసి సంజీవరావు, గుత్తుల శ్రీను, మెంటే సూర్యారావు, ఒగిరాల మహేష్ పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

తాడేపల్లిగూడెం: విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాల ఆధ్వర్యంలో జగనాథపురం, దండగర గ్రామాల్లో ఆదివారం కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం జగన్నాథపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం మండల నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ సర్దుబాటు ఛార్జీల బాదుడు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ ఛార్జీలు సామాన్య ప్రజలకు గుదిబండగా మారాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయ్యి ప్రజలకు కరెంట్ షాక్ ఇస్తున్నాయని తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి ఉల్లంకల జయకృష్ణ మాట్లాడుతూ 200 యూనిట్లలోపు విద్యుత్ వాడేవారికి ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి జగన్ మోసం చేశారని విమర్శించారు. ఇలా అయితే మరో విద్యుత్ పోరాటం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాయుడు, చంద్రరావు, నూకరాజు, సిపిఐ నాయకులు కర్రి సోమేశ్వరరావు, ఉల్లింకల నాగేంద్రప్రసాద్, సూరపరెడ్డి సోమేశ్వరరావు, ముల్లపూడి రాజు పాల్గొన్నారు.

మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కృష్ణమోహన్‌రావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎపి మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మరోసారి భీమవరానికి చెందిన రెవెన్యూ శాఖ ఉద్యోగి ఎస్.కృష్ణమోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరంలో ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలుసమస్యల పరిష్కారంపై డిమాండ్ చేసిన ఉద్యోగుల సంఘం అనంతరం నూతన కమిటీని ఎన్నుకుంది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా కృష్ణమోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా పెద్దిరాజు(సాలూరు పురపాలక సంఘం), కె.శివాజీ తుని(పురపాలక సంఘం), షేక్ కాజుద్దీన్(గిద్దలూరు) ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్ఎఫ్.అహ్మద్(సాలూరు), వైవి.మోహన్ రంగ(తుని), కె.చెంచయ్య(అద్దంకి), అడిషనల్ సెక్రటరీగా ఎ.ఆంజనేయులు(ఎమ్మిగనూరు), మహిళా కార్యదర్శిగా జి.నీలిమ(ఎలమంచిలి), వై.కోటేశ్వరమ్మ(చీరాల), పి.అబ్దుల్లా బేగం(నంద్యాల), కోశాధికారిగా ఎస్.వెంకటేష్(మచిలీపట్నం), పబ్లిసిటీ సెక్రటరీగా శ్రీనివాసరావు (భీమవరం అడ్మిన్స్ సెక్రటరీ) జాయింట్ సెక్రటరీలుగా జె.గోవిందయ్య(ఎలమంచిలి మున్సిపాలిటీ), రమణ (తణుకు), ఎం.మాల్యాద్రి (కావలి), వి.గిరిధర్‌బాబు (మదనపల్లి), సాంస్కృతిక విభాగం కార్యదర్శి వి.నాగేశ్వరరావు(పెడన), లీగల్ అడ్వైజర్‌గా సాయిరాం (కొవ్వూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు టి.కృష్ణమోహన్ రెడ్డి, ఎస్.షబ్బీర్‌అలీ, కోశాధికారి శ్రీధర్, రాష్ట్ర మున్సిపల్ కార్మికుల సంఘం (ఎఐటియూసి) అధ్యక్షులు నెక్కంటి సుబ్బారావు, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు గోగురాజు, పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.




కృష్ణమోహన్‌రావును సత్కరిస్తున్న సభ్యులు

ఆలోచించి ఓటు వేయమని అడగండి

వైసిపి ప్రజాప్రతినిధులకు డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

గత ప్రభుత్వం ఎంత మేర అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందించిందో వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఎంత మేలు చేకూరిందో ప్రజలనే ఆలోచించి ఓట్లు వేయమని అడగండని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు వైసిపి ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. వైసిపి వినూత్న రీతిలో జగనన్న ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనిలో జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, గృహసారథులు సచివాలయ కన్వీనర్లు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కుముదవల్లి రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిపి చంటి రాజు అధ్యక్షత వహించగా పివిఎల్ మాట్లాడారు. జగనన్న మీపై ఎన్నో ఆశలు పెట్టుకుని వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ఆయన ఆశలు వమ్ము చేయకుండా అర్హత ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వర్తింపజేశారన్నారు. నూటికి 98 మందికి పథకాలు మీ వల్లే సక్రమంగా అందుతున్నాయన్నారు. ప్రస్తుతం నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి వారికి ఎంత మేరకు ప్రయోజనం చేకూరిందో వివరించి, మొత్తం సచివాలయం పరిధిలో ఏ పథకానికి ఎన్ని కోట్లు ఖర్చు పెట్టింది వివరించాలన్నారు. రాత్రి నాయకులందరూ ఏదో ఒక కూడలిలో బస చేయాలన్నారు. తొలుత సచివాలయంలో స్థానిక ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి పథకాల గురించి వివరించి, ఆ పరిధిలో ఎంత ఖర్చు చేసింది డిస్ప్లే బోర్డ్‌లో ప్రదర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), సర్పంచుల ఛాంబర్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బొల్ల శ్రీనివాస్, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, జెసిఎస్ మండల కన్వీనర్ పాలా రాధాకృష్ణ, ఎఎంసి డైరెక్టర్ గుండు నాగేశ్వరరావు, కటిక శ్రీదేవి, వైస్ ఎంపిపిలు ఆదాడ లక్ష్మీ తులసి, చిల్లా అనూష పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పివిఎల్ నరసింహరాజు

ప్రశాంతంగా ముగిసిన ఎస్ఐ అభ్యర్థుల రాతపరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రెండు రోజుల పాటు జరిగిన ఎస్ఐ అభ్యర్థుల రాత పరీక్షలు ప్రశాంతంగా సాగాయని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ తెలిపారు. ఏలూరు రేంజ్ పరిధిలో ఉన్న ఎస్ఐ అభ్యర్థులకు ఏలూరు నగరంలోని ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 14వ తేదీన ప్రారంభమైన పరీక్షలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఏలూరు రేంజ్ పరిధిలో పరీక్షలకు మొత్తం 4162 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరిలో మొదటి రోజు ఉదయం పరీక్షకు 52 మంది, మధ్యాహ్నం పరీక్షకు 53 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. రెండో రోజు 55 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల ప్రక్రియను అశోక్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయని అభ్యర్థుల సౌకర్యార్థం ఏలూరు నగరంలోని రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో ప్రత్యేకంగా హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామన్నారు. బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి, కృష్ణా జిల్లా ఎస్‌పి జాషువ, కోనసీమ జిల్లా ఎస్‌పి శ్రీధర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాత పరీక్షకు హాజరైన అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి వారి బయోమెట్రిక్ ఆధారంగానే వారికి పరీక్ష హాల్లోకి అనుమతించామని తెలిపారు. జిల్లా అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు, డిటిసి డిఎస్‌పి కె.ప్రభాకర్‌రావు, డిఎస్‌పి గోగుల వెంకటేశ్వరరావు, ఏలూరు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రాజశేఖర్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, బి.ఆదిప్రసాద్ బందోబస్తు బందోబస్తు నిర్వహించారు.



ఎస్ఐ అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

భీమవరంలో తొలిసారి బాలోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం

పిల్లల్లో సృజనాత్మక నైపుణ్యాలను, చైతన్యాన్ని పెంచాలనే ధ్యేయంతో భీమవరంలో తొలిసారిగా బాలోత్సవం నిర్వహించనున్నట్లు హేలాపురి బాలోత్సవ కార్యదర్శి జివిఎల్ నరసింహారావు అన్నారు. బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక చింతలపాటి బాపిరాజు స్మారక ఉన్నత పాఠశాలలో ఆదివారం బాలోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రిటైర్డ్ డిఇఒ ప్రసాదరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ పిల్లల్లో చురుకుదనాన్ని, సృజనాత్మక, నైపుణ్యాలను, ఉన్నతమైన ఆలోచనలను పెంపొందించడానికి ఈ బాలోత్సవాలు చక్కని వేదిక అన్నారు. నవంబర్ 5వ తేదీన చింతలపాటి బాపిరాజు స్మారక ఉన్నత పాఠశాలలో అడవి బాపిరాజు స్మారక చిత్రలేఖనం నిర్వహించాలని భావిస్తున్నామన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక నాయకులు నారాయణ మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలో అత్యంత ప్రాతినిధ్యం వహించిన భీమవరం పట్టణంలో జరగబోయే అడవి బాపిరాజు స్మారక చిత్రలేఖనం ఉత్సవాలకు భీమవరం, పరిసర మండలాల నుంచి అధిక సంఖ్యలో బాల బాలికలు హాజరు కావాలని కోరారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్ కార్యనిర్వాహక కార్యదర్శి స్ఫూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల్లో క్రీడా స్ఫూర్తిని, ఆలోచనా సామర్థ్యాన్ని పెంచడం కోసం పట్టణంలో తొలిసారి ఈ బాలోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సభాధ్యక్షులు ప్రసాద్‌రాజు మాట్లాడారు. ఈ సమావేశంలో అల్లూరి భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం సభ్యులు వి.రాధాకృష్ణరాజు, ఎ.గిరిధర్, సునీల్ కుమార్, దక్షిణామూర్తి, అల్లూరి అరుణ్, యశోద పాల్గొన్నారు.

లలిత కళాంజలి అధ్యక్షులు రామలింగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లలిత కళాంజలి అధ్యక్షులు ఇయ్యపు రామలింగేశ్వరరావు (68) అనారోగ్యంతో హైదరాబాద్‌లో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మృతదేహం ఆదివారం సాయంత్రానికి పాలకొల్లు రావొచ్చని ఆయన బంధువులు చెబుతున్నారు. సుప్రసిద్ధ దర్శకులు కోడి రామకృష్ణకు ఆయన అత్యంత సన్నిహితంగా ఉండేవారు. కోడి రామకృష్ణ స్థాపించిన లలిత కళాంజలి జాతీయ నాటికల పోటీల నిర్వహణకు 30 సంవత్సరాల పాటు ఆయన తీవ్రంగా కృషి చేశారు. ఆయన మృతి పట్ల పలువురు కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

కలాంకు ఎంఎల్‌ఎ నిమ్మల నివాళి

ప్రజాశక్తి - పాలకొల్లు

గతంలో కాలుష్యం, ఆక్రమణలో ఉన్న శంభుని చెరువును తన హయాంలో సుందర పార్కుగా తయారు చేసి అబ్దుల్ కలాం హెల్త్ పార్కుగా నామకరణం చేసినట్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. కలాం జయంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని ప్రపంచ దేశాల సరసన క్షిపణి టెక్నాలజీలో నిలబెట్టిన ఘనత కలాంది అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు కర్నేన రోజారమణి, జివి, కర్నేన గౌరు నాయుడు, పెన్మెత్స రామభద్రరాజు పాల్గొన్నారు.


ఆకివీడు : కృషి పట్టుదల క్రమశిక్షణ ఉంటే మనిషి ఎంతటి ఉన్నత స్థితికైనా ఎదగలుగుతాడని అబ్దుల్ కలాం రుజువు చేశారని ప్రముఖ న్యాయవాది రీడర్స్ ఫొరం సభ్యులు నెల్లి సతీష్ కుమార్ తెలిపారు. అబ్దుల్ కలాం జయంతిని స్థానిక జిల్లా శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. అనంతరం అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అందుకు సంబంధించిన విశేషాలను రైడర్స్ ఫోరం అధ్యక్షులు, ఇంజనీర్ దాసరి సత్యనారాయణ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు ఉపాధ్యాయుడు కిషోర్, గ్రంథాలయ పాలకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత అవసరం

ఆచంట:నిత్యం భోజనానికి ముందు అర నిమిషం శ్రద్ధ వహించి చేతులు శుభ్రం చేసుకుంటే 70 శాతానికి పైగా రోగాలు దరికి చేరవని ఇఒపిఆర్‌డి మూర్తిబాబు అన్నారు. అంతర్జాతీయ చేతుల శుభ్రత దినోత్సవం ఆదివారం మండలంలోని ఆచంట కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మచెరువు, అయోధ్యలంక గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మూర్తిబాబు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులతో పాటు ఉద్యోగులు యువత, మహిళలు చిన్నచిన్న విషయాలను పట్టించుకోకపోవడంతో రోగాల బారిన పడుతున్నారన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్, డిజిటల్ అసిస్టెంట్ ఎం.రవీంద్ర, ఎఎన్‌ఎం డి.పుష్పరాజ్యం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో అంతర్జాతీయ హ్యాండ్ వాష్ డే కార్యక్రమం జెసిఐ రైజింగ్ క్లబ్ వారిచే ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ప్రపంచ చేతుల పరిశుభ్ర దినోత్సవం ప్రతి సంవత్సరమూ అక్టోబరు 15న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతిరోజూ చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. శుభ్రమైన చేతులే వ్యాధులను నివారిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం.రాయపూడి భవానీ ప్రసాద్, జెసిఐ రైజింగ్ సభ్యులు పాల్గొన్నారు.

గణపవరం : ప్రతి ఒక్కరూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి అన్నారు. ప్రపంచ చేతుల పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 25 పంచాయతీల్లో సర్పంచులు, కార్యదర్శులు, స్థానికులు పాల్గొన్నారు.


దొడ్డనపూడి సర్పంచి సుబ్బారావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల

జనసేన మండలాధ్యక్షులు ఏరుబండి రామాంజనేయులు కోమటిగుంట గ్రామంలో నిర్మించిన దుర్గా దేవి దేవస్థానంలో ఆదివారం దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రామాంజనేయులు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అఖండ అన్నసమారాధన నిర్వహించారు. దొడ్డనపూడి గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు, జనసేన ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, తోట వాసు, గవర లక్ష్మి, గాధం నానాజీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు జనసేన నాయకులను సత్కరించారు. పెదఅమిరంలో ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెనుమంత్ర:దుర్గాదేవి ఆశీస్సులు అందరికీ ఉండాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. దసరా సందర్భంగా ఆదివారం పొలమూరులో కలిదిండి సూర్యనారాయణరాజు కళా వేదికలో మొదటి రోజు అమ్మవారికి బాలాత్రిపుర సుందరీదేవి అలంకారం చేశారు. అమ్మవారిని పితాని సత్యనారాయణ, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, సర్పంచి కాకర రాజేశ్వరరావు దర్శించుకున్నారు.

లక్ష మంది లక్ష్యంగా సార్వత్రిక విద్య

ఆకివీడు:సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఈ సంవత్సరం లక్ష మంది విద్యార్థులను చేర్చుకోవాలనే లక్ష్యంతో పయనిస్తున్నామని విద్యాపీఠం రాష్ట్ర సమన్వయకర్త జి.శివ కోటేశ్వరరావు చెప్పారు. విద్యాపీఠం స్థానిక కేంద్రం విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో ప్రతి ఆదివారం నిర్వహించే తరగతుల్లో భాగంగా జరిగిన తరగతులను, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. పాఠశాల, కళాశాలల ద్వారా చదువుకోవడానికి అవకాశం లేని వారి కోసం ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యనభ్యసించి మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం సార్వత్రిక విద్య ద్వారా 90 వేల మంది విద్యనభ్యసించారని, ఈ సంవత్సరం లక్ష మందిని చేర్చడమే లక్ష్యంగా పయనిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 60,000 దరఖాస్తులు అందాయన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ బలరాం బాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివకోటేశ్వరరావు

ముప్పేట దాడి..!

వరికి తెగుళ్లు, ఎలుకల బెడద
రైతులు బెంబేలు


ఆచంటలో తెగుళ్లు సోకిన పొలాలకు మందు పిచికారీ చేస్తున్న రైతులు


ప్రజాశక్తి - ఆచంట

గతేడాది దాళ్వాలో అకాల వర్షాలకు నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు కొండంత ఆశతో ఈ ఏడాది సార్వాసాగు చేపట్టినా అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. ప్రస్తుతం సార్వాకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. నిన్న మొన్నటి వరకూ అధిక వర్షాలతో బెంబేలెత్తిపోయిన రైతులు నేడు చీడపీడలు, ఎలుకల ముప్పేట దాడితో హడలెత్తిపోతున్నారు.

మండలంలో 10,251 ఎకరాల్లో సార్వాసాగు జరుగుతోంది. రైతులు ఎంటియు 1318 రకం 90 శాతం వరకూ సాగు చేస్తున్నారు. మరో 10 శాతం స్వర్ణ, సంపత్ స్వర్ణ, పిఎల్‌ఎ 1100 వంటి రకాలు సాగు చేస్తున్నారు. వాతావరణంలో తరచూ సంభవిస్తున్న మార్పుల నేపథ్యంలో కొద్ది రోజుల నుంచి మండలంలోని ఆచంట, కొడమంచిలి, ఆచంట వేమవరం, పెనుమంచిలి, కందరవల్లి, కరుగోరుమిల్లి, వల్లూరు, కోడేరు, పెదమల్లం, శేషమ్మచెరువు తదితర గ్రామాల్లో వరిచేలకు తెగుళ్లు సోకాయి. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం అనేక చేలల్లో సుడిదోమ, పొడ, లద్ధి పురుగు, ఆకుముడత వంటి తెగుళ్లు విజృంభిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే వ్యవసాయ అధికారుల సూచనలు పాటించకుండా రైతులు నేరుగా పురుగుమందుల దుకాణాల వద్దకెళ్లి కొనుగోలు చేయడంతో తెగుళ్లు తగ్గడం లేదని అధికారులు చెబుతున్నారు.

మూషికాలతో ముప్పు.. మిగిలేది అప్పు..

ఆరుగాలం శ్రమించే రైతన్నకు వ్యవసాయంలో అడుగడుగునా కష్టాలే మిగులుతున్నాయి. వాతావరణ విపత్తులు, ఎరువుల భారం, అందని మద్దతు ధరతో రైతులు సతమతమవుతున్నారు. దీనికితోడు ఏటా మూషికాల దాడితో పంట నష్టం వచ్చి రైతులు కుదేలవుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌కు ఎలుకల దాడి పెరిగింది. చేను చిరు పొట్ట దశలో ఉంది. తెగుళ్లు సోకి సతమతమవుతున్న రైతులకు గోరు చుట్టుపై రోకలి పోటులా ఎలుకలు విజృంభిస్తున్నాయి. సార్వా సీజన్ మొదలైనప్పటి నుంచి ఒక్కో రైతు ఎకరాకు ఎలుకల నివారణ నిమిత్తం రూ.1,500 నుంచి రూ.2 వేల వరకూ ఖర్చు చేశాడంటే ఆశ్చర్యం కలగమానదు. ప్రస్తుతం చేలన్నీ చిరు పొట్ట దశలో ఉండడంతో పెద్ద ఎత్తున ఎలుకలు పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.


కొడమంచిలిలో ఎలుకలు కొట్టిన వరి చేను

ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం ఎన్ని పద్ధతులు అవలంబిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఎలుకల మందు కూడా సక్రమంగా పనిచేయడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో అధిక శాతం మంది కౌలు రైతులే. వీరిలో అనేకమంది అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నారు. ఎకరాకు పది నుంచి రూ.15 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. ఈ నేపథ్యంలో దిగుబడులు కూడా గణనీయంగా తగ్గిపోయే సూచనలు కనిపిస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

ఎఇఒ బి.నాగరాజును వివరణ కోరగా వాతావరణం పరిస్థితుల ప్రభావంతో తెగుళ్లు సోకుతున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించకుండా పురుగుమందుల దుకాణం వద్దకు వెళ్లి మందులను కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల తెగుళ్లు ఒకటి వాడే ముందు మరొకటి కావడంతో అవి పోవడం లేదన్నారు. పొడ తెగులుకు హెక్సా కొనాజోల్ 400 ఎంఎల్, సుడిదోమకు ఫైమెట్రో జెన్ 120 గ్రాములు, లేదా బు ప్రోపెజిన్ 330 ఎంఎల్, లేదా ట్రై ఫ్లూ మెజో ఫైరిమ్ 94 ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచ్చికారీ చేయాలన్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి...

విషపూరిత పురుగుమందులు అధిక మోతాదులో వాడడం వల్ల ఎలుకల సహజ శత్రువులైన పాము, గుడ్లగూబ, పిల్లి, ముంగిస వంటివి చనిపోతున్నాయని తద్వారా ఎలుకల ఉధృతి పెరుగుతుందని, సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలని ఎఇఒ నాగరాజు తెలిపారు. మండలంలో ఆర్‌బికెల ద్వారా ఎలుకల నివారణా మందును పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులు ఈ సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వ్యవసాయం భారంగా మారింది..

సత్యవాడ సూర్యనారాయణ, కౌలు రైతు, ఆచంట



వ్యవసాయం చేయడం భారంగా మారింది. నేను ఆరెకరాలు కౌలుకు చేస్తున్నాను. ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ పెట్టుబడులు పెట్టాను. వాతావరణ మార్పుల నేపథ్యంలో తెగుళ్లు సోకుతున్నాయి. ప్రస్తుతం సుడిదోమ, పొడ ఆకుముడత వంటి తెగుళ్లు ఎక్కువగా ఉన్నాయి.

ఎలుకల బెడద విపరీతంగా ఉంది..

కడలి పెద్దరాజు, కౌలు రైతు, ఆచంట



ఒక పక్క తెగులుసోకి నానా ఇబ్బందులు పడుతున్నాం. మరోపక్క ఎలుకల బెడద విపరీతంగా పెరిగిపోయింది. ఇప్పటివరకూ ఎలుకల నిర్మూలనకు రూ.2 వేల వరకూ ఖర్చు చేశాను. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఎలుకల మందు పనిచేయడం లేదు. ప్రస్తుతం పంట పొలాలు చిరుపొట్ట దశలో ఉండడంతో పెద్ద ఎత్తున ఎలుకలు చొరబడి పంటలను నాశనం చేస్తున్నాయి.

పెట్టుబడులు పెట్టలేకపోతున్నాం..

దూడే శ్రీను, కౌలు రైతు, ఆచంట



ఎన్నడూ లేని విధంగా చీడపీడలు విపరీతంగా పెరిగిపోయాయి. పెట్టుబడులు పెట్టలేకపోతున్నాం. వాతావరణంలో వస్తున్న మార్పులే తెగుళ్లకు ప్రధాన కారణం. విత్తనాల నుంచి ధాన్యం కొనుగోలు వరకూ ఆర్‌బికెల్లోనే అనడం తప్ప చర్యలు శూన్యం. రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై మందులు పంపిణీ చేయాలి.

టిడిపి నేతల వినూత్న నిరసన

ప్రజాశక్తి - పాలకొల్లు

వ్యవస్థల్ని మేనేజ్ చేస్తూ, న్యాయానికి జగన్ సంకెళ్లు వేశాడని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం రాత్రి ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ గాంధీ బొమ్మ సెంటర్ వద్ద చేతులకు నల్లతాడు, రిబ్బన్‌తో సంకెళ్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జివి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



పాలకొల్లు : చేతులకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న నేతలు

పెనుమంత్ర : చంద్రబాబుకు కోర్టు నోటీసులు పలు సార్లు వాయిదా పడడం సరికాదని మాజీ మంత్రి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ అన్నారు. ఆదివారం మార్టేరు సెంటర్లో న్యాయానికి సంకెళ్లు కార్యక్రమంలో భాగంగా చేతులకు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ, కార్యక్రమంలో మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లాలు), మండల కార్యదర్శి మోహన్‌రావు, ఆచంట కేతా మీరయ్య , పోడూరు మండలం గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

మొగల్తూరు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా పార్టీ నాయకులు ఆదివారం రాత్రి చేతులకు సంకెళ్లు వేసుకుని గ్రామంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, కలిదిండి కుమార్‌బాబు, బొల్ల చంటి, పాల రాంబాబు పాల్గొన్నారు.

ఆకివీడు : టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వినూత్న రీతిలో నేతలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ స్థానిక మెయిన్ సెంటర్లోని గాంధీ విగ్రహం వద్ద నేతలు చేతులకు నల్ల రిబ్బన్లతో సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఆచంట:వైసిపివి కక్షపూరిత రాజకీయాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆచంటలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలకు సంఘీభావం తెలిపారు. అనంతరం రిలే దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడారు. త్వరలోనే వైసిపి ప్రభుత్వ అరాచకాలకు ప్రజలు స్వస్తి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, నేతలు కేతా మీరయ్య, నెక్కంటి ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

పాలకొల్లు : జగన్ పాలనలో న్యాయానికి సంకెళ్లు వేశారని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద 33వ రోజు ఆదివారం గవర కులస్తులు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు చేతులకు నల్ల రిబ్బన్లు కట్టుకుని జగన్ ప్రభుత్వ వైఖరికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పరిపాలన కన్నా ప్రతిపక్షాలను అణగదొక్కడమే ధ్యేయంగా పాలన చేశారని విమర్శించారు.


పెనుమంత్రలో..

స్థిరాస్తుల కొనుగోలులో చట్టబద్ధత ఉండాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

స్థిరాస్తులు కొనుగోలులో చట్టబద్ధత కలిగి ఉండాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి అన్నారు. ఆదివారం తణుకులోని శ్రీశ్రీ విజ్ఞాన కేంద్రంలో ఆయన ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు లాభాల కోసం ఆస్తులు అమ్ముతూ ఉంటారన్నారు. స్థిరాస్తులు కొనుగోలు చేసేవారు ముందుగా ఆస్తులకు చట్టపరమైన దస్తావేజులు ఉన్నవీ లేనిదీ పరిశీలించాలన్నారు. లేకపోతే న్యాయవాది సలహాతో ఆస్తులను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవన్నారు. రిజిస్టర్ అయిన ఆస్తులన్నీ చట్టబద్ధత కలిగి ఉంటాయని అనుకోవడం సరికాదన్నారు. స్థిరాస్తి విషయంలో అమ్మే వారికి ఆస్తిపై ఎటువంటి హక్కు ఉందీ అనేదాన్ని ముందుగా తెలుసుకోవాలన్నారు. చట్టబద్ధత లేని స్థిరాస్తులు కొంటే భవిష్యత్తులో అనేక ఇబ్బందులకు గురవుతామని తెలిపారు. చట్టబద్ధమైన ఆస్తి వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇంగ్లీష్ పబ్లిక్ స్పీకింగ్‌లో మాస్టర్ ఆరేటర్ ఛాంపియన్ షిప్ సీజన్ 5లో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్ఆర్‌కెఆర్ కంప్యూటర్ సైన్స్‌లో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆముదాలపల్లి జయశ్రీకి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ పదివేల రూపాయల నగదు బహుమతిని ప్రకటించి అందించనున్నట్లు చెప్పారు. ఆదివారం కళాశాల యాజమాన్యం జయశ్రీని ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా నిశాంత్ వర్మ మాట్లాడుతూ చినఅమిరం నుంచి జాతీయ స్థాయికి ఎదుగుతున్న మరో ఆణిముత్యం జయశ్రీ అన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణమరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక క్లబ్ ఏర్పాటు చేసి వారి ఉన్నతికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

దసరాకు డిఎ ప్రకటించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా సబ్ కమిటీ సమావేశం భీమవరంలోని లూథరన్ హైస్కూల్లో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం మాట్లాడుతూ గత నెలలో ఎపి ఎన్‌జిఒ సమావేశంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దసరాకు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు డిఎ ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీ మేరకు దసరాకు డిఎ ప్రకటించాలని కోరారు. అదేవిధంగా దీర్ఘకాలంగా బకాయి ఉన్న పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ లోన్లు, సంపాది సెలవు నగదు బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బివి నారాయణ మాట్లాడారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు జి.ప్రసన్న కుమార్, డి.ఝాన్సీ విజయకుమారి, జి.పార్వతి, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

వైసిపితోనే గ్రామ స్వరాజ్యం

ప్రజాశక్తి - ఉండి

వైసిపితోనే గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నెరవేరిందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. ఆదివారం ఉండి అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో రాష్ట్రానికి జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమంపై వాలంటీర్లకు శిక్షణ తరగతులను మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పివిఎల్ నరసింహరాజు, జిలాని భాష పాల్గొని మాట్లాడారు. దేశానికే వాలంటీర్ వ్యవస్థ ఆదర్శప్రాయంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, రూరల్ బ్యాంక్ ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

సద్గుణాంబ వారధి నిర్మాణం అభినందనీయం

ప్రజాశక్తి - ఉండి

దశాబ్దాల కాలం నాటి కలిగొట్ల ప్రజల సమస్యను తీర్చేందుకు గ్రామ సర్పంచి మాదిరెడ్డి సూర్య సత్యనారాయణ, ఎంపిటిసి రుద్రరాజు సూర్యనారాయణరాజు తదితరులు పాటుపడడం అభినందనీయమని రాజు వేగేశ్న ఫౌండేషన్ ఛైర్మన్ అనంత కోటిరాజు అన్నారు. కలిగొట్లలో వేగేశ్న అనంత కోటిరాజు సహకారంతో నిర్మించిన సద్గుణాంబ వారధి ప్రారంభోత్సవం ఎంపిటిసి రుద్రరాజు సూర్యనారాయణ రాజు (యువరాజు) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేగేశ్న అనంత కోటిరాజు, ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలిగొట్ల ప్రజల చిరకాల కోరిక ఈ వంతెన నిర్మాణమన్నారు. వంతెన నిర్మాణంతో రైతుల కష్టాలన్నీ తీరిపోయాయన్నారు. వంతెన నిర్మాణానికి వేగేశ్న అనంత కోటిరాజు రూ.25 లక్షలు విరాళం ఇచ్చారన్నారు. అలాగే రైతులు, గ్రామస్తులు కలిసి మిగతా రూ.45 లక్షలు సేకరించి వంతెన నిర్మాణం పూర్తిచేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ రామరాజుకు, పివిఎల్ నరసింహరాజుకు, మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజుకు, అధికారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, కలిగొట్ల గ్రామ సర్పంచి మాదిరెడ్డి సూర్య సత్యనారాయణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


వారధిని ప్రారంభిస్తున్న నేతలు

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పెన్మత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 2002-2003 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశమై ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం ఆనాటి 15 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల ఆవరణలో ఆహ్లాదంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఉండి

మహదేవపట్నంలోని కోడిపందేల స్థావరంపై ఉండి పోలీసులు దాడి చేసి బద్ది నాగార్జున, మరో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎఎస్‌ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి వెయ్యి రూపాయల నగదు, కోడి, ఒక కోడి కత్తి, 11 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైసిపి అభివృద్ధి పనులను ప్రచారం చేయాలి

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ ప్రచారం చేయాలని, గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి తేడాను ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. పెదఅమిరంలోని వైసిపి కార్యాలయంలో 'వై ఏపి నీడ్స్ సిఎం జగన్' కార్యక్రమంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ ప్రతిపక్షాల ఆరోపణలను వైసిపి ప్రభుత్వం విజయాలతోనే గట్టిగా తిప్పికొట్టాలన్నారు. విభజన తర్వాత రాష్ట్ర సమగ్ర పురోగతికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కొనసాగడం చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, సర్పంచుల ఛాంబర్ జిల్లా అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, కోపల్లె సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయరామ కృష్ణంరాజు, పి.దుర్గా ప్రసాదరాజు, మన్నే నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పివిఎల్ నరసింహరాజు


ఒరిగిన విద్యుత్ స్తంభం

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం..!

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ పరిధి అబ్రహంపేటలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. స్తంభం ఒక పక్కకు ఒరిగిపోవడంతో సమీపంలో నివాసం ఉంటున్నవారు స్తంభానికి తాళ్లు, కర్రల సహాయంతో పడకుండా నిలబెట్టారు. ఎప్పుడు స్తంభం ఒరిగి ప్రమాదం ముంచుకొస్తుందా అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు. సమస్యను ప్రజాశక్తి విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ వేంద్ర పెద్దిరాజు దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.